

అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం అన్నదాన పథకానికి మంగళవారం కర్నూలుకు చెందిన పత్తికొండ విజయలక్ష్మి కుటుంబ సమేతంగా రూ.1,00,010 విరాళాన్ని అందజేశారు.



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరునికి, బయలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై ఖమ్మంకు చెందిన మీనా నృత్యాలయ డ్యాన్స్ అకాడమి వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.

న్యూస్‌రీల్

మహానందీశ్వరుడి హుండీ ఆదాయం రూ. 38.37 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో హుండీ కానుకల లెక్కింపు ద్వారా మహానందీశ్వర స్వామికి 33 రోజులకు రూ. 38,37,413 ఆదాయం వచ్చినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహానందిలోని స్థానిక అభిషేక మండపంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారి ఆలయాల ద్వారా రూ. 37,86,188 రాగా, అన్నప్రసాదం విభాగం ద్వారా రూ. 33,325, గోవు సంరక్షణ ద్వారా రూ. 17,900 వచ్చిందని చెప్పారు. దీంతో పాటు యూఎస్‌ఏ, శ్రీలంక, దుబాయ్, నేపాల్ దేశాల కరెన్సీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు వై.మధు, ఓంకారం వెంకటేశ్వరుడు, గ్రూపు దేవాలయాల ఈఓ వి.జనార్దన్, తిరుమల బాలాజీ సేవా సమితి, బాలాజీ సేవా ట్రస్ట్ సభ్యులు సేవలు అందించారు.

3 నుంచి ఏప్రిల్ నెల పింఛన్లు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రతి నెల మొదటి రోజే పంపిణీ చేసే వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక ఏప్రిల్ నెల మూడు రోజులు ఆలస్యం కానుందని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 ఆదివారం నాటితో ఆర్థిక సంవత్సరం ముగుస్తుందని, మరుసటి రోజు ఏప్రిల్ 1న బ్యాంకులకు సెలవు ఉందని, 2వ తేదీ పింఛన్ల బడ్జెట్‌ను ప్రభుత్వం బ్యాంకులకు విడుదల చేస్తుందని చెప్పారు. అదే రోజు వార్డు, గ్రామ సచివాలయాల సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి మరుసటి రోజు అంటే 3వ తేదీ నుంచి పింఛన్‌దారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని పింఛన్‌దారులు గమనించాలని ఆయన కోరారు.

అన్నొస్తున్నాడు!

- నేడు ఇడుపులపాయ నుంచి సీఎం వైఎస్ జగన్ బస్సుయాత్ర
- సాయంత్రం చాగలమర్రి మీదుగా నంద్యాల జిల్లాలోకి ప్రవేశం
- రాత్రి ఆళ్లగడ్డలో బస



సాక్షి, నంద్యాల: నవరత్నాలతో పేదల ఇళ్లలో వెలుగులు నింపి.. సచివాలయాలతో సరికొత్త పాలన అందించి.. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులతో చదువుల విప్లవం తెచ్చి.. హెల్త్ క్లినిక్‌లు, మెడికల్ కళాశాలతో అందరికీ ఆరోగ్య రక్ష కట్టిన సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల్లోకి వస్తున్నారు. ఐదేళ్లలో పేదల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పాలన అందించిన జగనన్న సార్వత్రిక ఎన్నికల వేళ 'వైనాట్ 175' అంటూ ఎన్నికల రణరంగంలో సమరభేరి మోగించేందుకు సిద్ధమయ్యారు. బుధవారం ఇడుపులపాయ నుంచి ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయనున్నారు. ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్లలో 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్ర సాగనుంది. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేయడమే లక్ష్యంగా యాత్ర సాగనుంది. సిద్ధం సభలు జరిగిన పార్లమెంట్ నియోజకవర్గాలను మినహాయించి మిగిలిన 21 ఎంపీ స్థానాల పరిధిలో యాత్ర సాగనుంది. ప్రతి రోజు ఒక భారీ బహిరంగ సభతో పాటు, స్థానికంగా ఉన్న రైతులు, విద్యావేత్తలు, మేధావులతో సమావేశం కానున్నారు. బుధవారం ఉదయం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రార్థనలు చేసిన అనంతరం సీఎం యాత్రను ప్రారంభించనున్నారు. సాయంత్రం ప్రొద్దుటూరులో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. 58 నెలల పాలనలో ప్రభుత్వ పరంగా చేసిన మంచి పనులను వివరించనున్నారు. సంక్షేమ పథకాల వల్ల చేకూరిన లబ్ధిని ప్రజల మధ్యే తెలియజేయనున్నారు. సభ ముగిసిన అనంతరం చాగలమర్రి చెక్‌పోస్టు వద్ద నంద్యాల జిల్లాలోకి సీఎం వైఎస్ జగన్ ప్రవేశిస్తారు.

అపూర్వ స్వాగతం పలికేందుకు అంతా సిద్ధం

సీఎం వైఎస్ జగన్‌కు అపూర్వ స్వాగతం పలికేందుకు నంద్యాల జిల్లా పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. తమ అభిమాన నేతను చూసేందుకు ఎప్పుడెప్పుడా అని కార్యకర్తలు, అభిమానులు, నాయకులు ఎదురు చూస్తున్నారు. చాగలమర్రి చెక్‌పోస్ట్ వద్ద వేల మంది ప్రజల నినాదాల మధ్య జననేతకు ఘన స్వాగతం పలికేందుకు ఇప్పటికే పార్టీ నేతలు ఏర్పాట్లు పూర్తి చేశారు. భారీ జన సందోహం, పార్టీ శ్రేణుల కోలాహలం మధ్య సీఎం జగన్ ఆళ్లగడ్డకు చేరుకుంటారు. ఆళ్లగడ్డ పట్టణ సమీపంలో రాత్రి బస చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి.

భారీ పోలీసు బందోబస్తు

సీఎం వైఎస్ జగన్ చేపట్టనున్న బస్సు యాత్ర కార్యక్రమానికి సుమారు 1500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. సీఎం ప్రయాణించే మార్గాన్ని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి పరిశీలించి, భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆళ్లగడ్డ పట్టణం సమీపానికి రాత్రి 9 గంటలకు సీఎం చేరుకునే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు, నాయకులు యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ నేతలు పిలుపునిచ్చారు.

ఏర్పాట్ల పరిశీలన..



సీఎం బస ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీరారెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 27వ తేదీ రాత్రి ఆళ్లగడ్డలో బస చేయనున్న ప్రాంతాన్ని, అక్కడ చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఎలాంటి బందోబస్త్ ఏర్పాటు చేయాలన్న అంశంపై స్థానిక పోలీస్ అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. స్థానిక నాయకులతో వారు చర్చించారు. రూట్ మ్యాప్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టనున్న బస్సు యాత్రను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరం కలిసికట్టుగా విజయవంతం చేద్దామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఆళ్లగడ్డ అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'మేమంతా సిద్ధం' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27వ తేదీ ప్రొద్దుటూరులో బహిరంగ సభ అనంతరం ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి నుంచి రోడ్ షో నిర్వహిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆళ్లగడ్డ పట్టణానికి చేరుకుంటారన్నారు. రాత్రి అక్కడ బస చేయడం జరుగుతుందన్నారు. 28వ తేదీ ఉదయం ఆళ్లగడ్డ నుంచి నంద్యాలకు బహిరంగ సభకు వెళ్తూ మార్గ మధ్యలో శిరివెళ్ల మండలం ఎర్రగుంట్లలో రైతులు, స్థానిక నాయకులతో చర్చా వేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి, వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు భూమా కిషోర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై కొలువై భక్తులను అనుగ్రహిస్తున్న ఉగ్రనరసింహుడు



వైభవోపేతం.. గరుడోత్సవం

- ఉగ్రనరసింహుడి దర్శనంతో పులకించిన భక్తజనం
- శాస్త్రోక్తంగా ముగిసిన ఎగువ అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు



దిగువ అహోబిలం కోనేరులో తీర్థవారి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: అహోబిలేశుని బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఎగువ అహోబిలంలో ఉగ్ర నరసింహుడికి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రనృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి అమ్మవార్లను ముస్తాబు చేసిన గరుడ వాహనంపై కొలువుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణలు.. ఆస్థాన విద్యాంసుల మంగళకర వాయిద్యాలు.. భక్తులు గోవింద నామస్మరణలు హోరెత్తగా గరుడోత్సవం కనుల పండువగా సాగింది. ఈ వేడుకలు సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు కొనసాగాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం చేపట్టారు. ఉత్సవాల ప్రారంభం రోజు సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజ స్తంభంపై ఆవిష్కరించిన పటాన్ని అవరోహణం చేశారు.

దిగువ అహోబిలంలో..

ప్రహ్లాదవరదుడి బ్రహోత్సవ వైభవం దిగువ అహోబిల క్షేత్రంలో మంగళవారం అంబరాన్ని తాకింది. ప్రణయ కలహోత్సవం, తీర్థవారి చక్రస్నానం, ద్వాదశ ఆరాధనం, పుష్పయాగం కార్యక్రమాలు కనులపండువగా నిర్వహించారు. ప్రణయ కలహోత్సవ వేడుకలో శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు ఓ వైపు, ప్రహ్లాదవరద స్వామి ఓ వైపు నిలిచి ఆసక్తికర సన్నివేశాలను ఆవిష్కరించగా భక్తులను ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికేందుకు దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా స్థానిక కోనేరులో తీర్థవారి చక్రస్నానం నిర్వహించారు. మధ్యాహ్నం ద్వాదశ ఆరాధనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళకరమైన వాయిద్యాల నడుమ శ్రీ ప్రహ్లాదవరదుడు దేవేరీ మహాలక్ష్మీల పుష్పయాగం వేడుక రాత్రి వైభవంగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:51
ఆదోని	సా॥ 6:38	ఉ॥ 4:54
నంద్యాల	సా॥ 6:35	ఉ॥ 4:48
ఆత్మకూరు	సా॥ 6:33	ఉ॥ 4:49
బనగానపల్లె	సా॥ 6:36	ఉ॥ 4:49

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :

మీ సంతానం తప్పుల పట్ల శాపనార్థాలు పెట్టకండి. పవిత్ర రంజాన్ మాసంలో మీ శాపాల పట్ల దైవదూతలు ఆమీన్ అంటే అల్లాహ్ దానిని నిజం చేస్తారు. – పవిత్ర ఖురాన్

కోడ్ ఉంది.. నగదు జాగ్రత్త!

- రూ.50 వేలకు పైగా తరలిస్తూ ఉంటే రుజువులు తప్పనిసరి
- రూ.10 లక్షలకు పైగా నగదు పట్టుపడితే ఆదాయ పన్ను శాఖకు అప్పగిస్తాం
- కర్నూలు పార్లమెంట్ వ్యయ నోడల్ అధికారి రమేష్‌బాబు



దేవనకొండ సమీపంలో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): 'ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఇప్పటికే జిల్లా, అంతర్ జిల్లా, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. జాగ్రత్తలు తీసుకోకుండా నగదు నగదు, బంగారం, ఇతర వస్తులతో బయటకు వెళ్లి పోలీసులకు పట్టుబడితే వాటిని తిరిగి దక్కించుకోవడం తలకుమించిన భారమవుతుంది. అందుకే ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువుల తరలింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి' అని కర్నూలు పార్లమెంట్ వ్యయ పరిశీలకుడు రమేష్‌బాబు సూచిస్తున్నారు. మరిన్ని సూచనలు ఆయన మాటల్లోనే..

- నేను కర్నూలు పార్లమెంట్ స్థానానికి, జిల్లా సహకార శాఖ అధికారి ఎస్.రామాంజనేయులు అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా ఉన్నాం. మాతో పాటు సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీమ్‌లు ఉంటాయి. మేమంతా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆధ్వర్యంలో పని చేస్తాం.
- రూ.50 వేలకుపైగా నగదుతో పోలీసులకు పట్టుబడితే సీజ్ చేస్తారు. నగదు ఎక్కడి నుంచి వచ్చింది, ఏ బ్యాంకులో నుంచి డ్రా చేశారు, ఏ ఏటీఎంలో నుంచి తీశారు, ఎందుకోసం తీశారు, ఎక్కడికి తీసుకెళ్తున్నారనే ఆధారాలు ఉంటే వదిలేస్తారు. ఆ వివరాలు లేకపోతే మాత్రం నగదును సీజ్ చేస్తారు.
- రూ.10 వేలకు పైగా విలువ చేసే బంగారం, ఇతర వస్తువులు తరలిస్తున్నా ఆధారాలు ఉండాలి. లేకపోతే వాటిని కూడా సీజ్ చేసి ట్రెజరీల్లో డిపాజిట్ చేస్తారు. ఒక వేల రసీదు ఇంటి వద్ద ఉంటే ఆ తర్వాత చూపించి విడిపించుకోవచ్చు.
- రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు తరలించే నగదుకు విధిగా అకౌంటబులిటీ ఉండాలి. రూ.10 లక్షలపైన తరలించే నగదుకు అకౌంటబులిటీ ఉన్నా సీజ్ చేసి ఆదాయపు పన్నుశాఖ అధికారులకు అప్పగిస్తారు. వారు నగదు ఎలా సంపాదించారని, ఆదాయ పన్ను చెల్లిస్తున్నారో లేదో అనే వివరాలు సేకరించి అన్నీ సక్రమంగా ఉంటే బాధితుడికి అప్పగిస్తారు. ఇదంతా సమయం పడుతుంది. నగదుతో పట్టుబడి ఇబ్బందులు పడకూడదనే సాధారణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.
- పోటీ చేసే అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచార ప్రకటనల కోసం మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

- పార్లమెంట్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు రూ.95 లక్షలు, అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయరాదు. ఇంతకు మించి ఖర్చు చేస్తే అటువంటి వారిపై ఎన్నికల కమిషన్ అనర్హత వేటు వేసే అవకాశం ఉంది. ఎన్నికల ప్రచారానికి వచ్చే స్టార్ క్యాంపెయినర్ వద్ద రూ.లక్ష వరకు నగదు ఉంచుకునేందుకు అనుమతి ఉంది. అంతకు మించి ఉంటే సీజ్ చేసే అవకాశం ఉంది. స్టార్ క్యాంపెయినర్ ప్రచారంలో వినియోగించే జెండాలు, వాహనాలను బట్టి ఖర్చును సహాయ వ్యయ పరిశీలకులు అంచనా వేస్తారు.

మహిళ ఆత్మహత్య

కర్నూలు: భర్త మందలించాడనే మనస్తాపంతో ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం రామలింగాయపల్లె గ్రామానికి చెందిన నాగేంద్రబాబు, సునీత(40) దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారు. వీరు ఉపాధి నిమిత్తం నాలుగేళ్ల క్రితం కర్నూలుకు వలస వచ్చి రామలింగేశ్వర నగర్‌లో నివాసముంటున్నారు. నాగేంద్రబాబు ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. భార్య సునిత కొంతకాలంగా తీవ్రమైన మోకాలి నొప్పితో బాధపడుతూ పెయిన్ కిల్లర్స్ మందులు వాడేది. పెయిన్ కిల్లర్స్ మందులు వాడటం మంచిది కాదని, మోకాలి నొప్పికి శస్త్రచికిత్స చేయించుకోవాలని భర్త చెప్పినా వినిపించుకోకపోవడంతో గట్టిగా మందలించాడు. ఈ విషయమై ఆమె కలత చెంది సోమవారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి తమ్మినేని వెంకటనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు నాల్గవ పట్టణ పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై విచారణ జరుపుతున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

క్లుప్తంగా

వడదెబ్బతో బాలుడి మృతి



మృతి చెందిన లక్ష్మీనరసయ్య ఆచారి

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంలో వడదెబ్బకు 18 నెలల బాలుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బ్రహ్మయ్య ఆచారి, రాజేశ్వరి దంపతులు తమ పిల్లలతో కలిసి సోమవారం అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు వెళ్లారు. అక్కడ స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడిలో భాగంగా చిన్న కుమారుడు లక్ష్మీనరసయ్య ఆచారి తల నీలాలు సమర్పించి రాత్రికి ఇంటికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం నిద్ర లేచి చూడగా చిన్న కుమారుడు అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే స్థానిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా వారు పరీక్షించి వడదెబ్బతో మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది.

ప్రశాంతంగా ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో మంగళవారం ఓపెన్ పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ లక్ష్మీ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి సాంఘిక శాస్త్రం పరీక్షకు 1,191 మంది విద్యార్థులకు గాను 1039 మంది హాజరు కాగా 152 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ సాయనశాస్త్రం, ఆర్థిక శాస్త్రం పరీక్షలకు 1,173 మందికి గాను 1,027 మంది హాజరు కాగా 146 మంది గైర్హాజరైనట్లు వివరించారు. రాష్ట్ర పరిశీలకులు గంగాభవానీ ఓపెన్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా పది ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు 18 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారన్నారు.

నేడు నూతన విత్తన రకాలపై వర్క్‌షాప్

కర్నూలు(అగ్రికల్చర్): నూతన విత్తన రకాలపై బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించనున్నారు. కొన్నేళ్లుగా వేరుశనగలో కే-6 రకం, శనగ(బెంగాల్ గ్రామ్)లో జేజీ-11, కందిలో ఎల్ఆర్‌జీ 41 రకాలు మాత్రమే సబ్సిడీపై ఇస్తున్నారు. 2024-25లో కొత్త వెరైటీలను సబ్సిడీపై పంపిణీ చేయడానికి వ్యవసాయ రంగం సిద్ధం చేసింది. వేరుశనగలో టీసీజీఎస్ 1694 రకం సబ్సిడీపై పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే జిల్లాకు ఈ రకం 1,200 క్వింటాళ్లు కేటాయించింది. వేరు శనగలోనే కే.లేపాక్షి రకాన్ని అందుబాటులోకి తీసుకరావాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తోంది. శనగలో జేసీ-11కు ప్రత్యామ్నాయంగా ఎన్‌బిఇజి-49, వఖెన్‌బిఇజి-452 రకాలు, కందిలో ఎల్ఆర్‌జీ-41కు ప్రత్యామ్నాయంగా పీఆర్‌జీ 176, పీఆర్‌జీ 158, ఎల్ఆర్‌జీ 52, ఐసీపీహెచ్ 2740 రకాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ ఉంది. ఈ నూతన రకాలు అధిక దిగుబడి, చీడపీడలను తట్టుకునే రకాలేనని అధికారులు చెబుతున్నారు.

ఎన్నికల్లో మీడియా కీలక పాత్ర పోషించాలి

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: ప్రజాస్వామ్యంలో ఎన్నికల సమగ్రతను, పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగుపరచడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన చాంబర్‌లో సాధారణ ఎన్నికల నేపథ్యంలో మీడియా పోషించాల్సిన పాత్ర, పెయిడ్ న్యూస్, పత్రికలలో ప్రకటనలు, స్థానిక కేబుల్ ప్రసారాలలో రాజకీయ ప్రకటనలు తదితర అంశాలపై ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలలో ఓటర్లు పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయడానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహకరించాలన్నారు. ఓ వ్యక్తిని పొగుడుతూ ఒకే వార్త ఒకేలా అన్ని పత్రికలలో ప్రచురితమైతే పెయిడ్ న్యూస్ కింద లెక్క కట్టి పోటీ చేసే అభ్యర్థి ఖాతాలో నమోదు చేస్తామన్నారు. జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతో పాటు, చెల్లింపు వార్తలను (పెయిడ్ న్యూస్) ఈ కమిటీ పర్యవేక్షించి సంబంధిత అభ్యర్థి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఫేక్ న్యూస్ లను కాకుండా సత్యమైన, వాస్తవిక దృష్టితో వార్తలు ప్రసారం అయ్యేలా మీడియా ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని జిల్లా ఎన్నికల మీడియా కేంద్రం నుంచి ఐఅండ్‌పీఆర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు తెలియజేస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్రకుమార్, ఎంసీఎంసీ నోడల్ అధికారి సునీల్ కన్నా, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి కట్టుదిట్టంగా అమలు

ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ప్రచురితమైన ప్రతికూల వార్తలకు బాధ్యులను చేస్తూ సంబంధిత 40 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. సీ- విజిల్ ద్వారా 78 ఫిర్యాదులు అందాయని 100 నిమిషాల్లో సంబంధిత ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందన్నారు. ఎప్పటికప్పుడు ఎన్నికల సమాచారం సేవల కోసం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు సత్వర చర్యలు

వేసవి దృష్ట్యా తాగునీటికి ఇబ్బంది లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టర్ చాంబర్‌లో వేసవిలో జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న 16 మండలాల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. తీవ్ర తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. రక్షిత నీటి పథకాలకు సంబంధించిన పనుల ప్రతిపాదనలు బుధవారం సాయంత్రంలోగా పంపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, పబ్లిక్ హెల్త్ ఈఈ, ఇరిగేషన్ ఎస్ఈ, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి మోహన రావు, ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ, డీపీఓ మంజులవాణీ, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ రామచంద్ర, గ్రౌండ్ వాటర్ డీడీ రఘురాం పాల్గొన్నారు.

కాపుల సంక్షేమానికి పెద్ద పీట

- కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 3కోట్లు మంజూరు
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



కాపుల సమావేశంలోమాట్లాడుతున్న మంత్రి బుగ్గన

డోన్: రాష్ట్రంలో కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులస్తుల సంక్షేమం కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎనలేని కృషి చేసిందని ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మంత్రి బుగ్గన స్వగృహంలో మంగళవారం జరిగిన కాపు, బలిజ కులస్తుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. కాపుల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడమే కాక ప్రతి కాపు కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించిన చరిత్ర దేశంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాపుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలతో పాటు నియోజకవర్గానికి ఒక కాపు భవన్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా డోన్‌లో 10 సెంట్ల స్థల కేటాయించి, భవన నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ భవన నిర్మాణం పూర్తి అయితే కాపు సోదరులు వివాహ, శుభకార్యాలు జరుపుకునేందుకు వీలు కలుగుగుతుందన్నారు.

అందరి సహకారంతో పట్టణాభివృద్ధి

అందరి సహకారంతోనే నియోజకవర్గ కేంద్రమైన డోన్ పట్టణాన్ని అభివృద్ధి చేశామని మంత్రి అన్నారు. పట్టణాభివృద్ధిలో భాగంగా అప్పటి మున్సిపల్ కమిషనర్ కొన్ని ప్రాంతాంలో రహదారుల ఆక్రమణలను తొలగించారని వివరించారు. ఈ విషయంలో కొందరు తనపై ద్వేషం పెంచుకొని కూరగాయల మార్కెట్ నిర్మాణం పనులను రెండేళ్ల పాటు అడ్డుకున్నారన్నారు. ఇలాంటి వ్యక్తులు అభివృద్ధి నిరోధకులుగా మారి తనపై నిందలు వేయడం సరి కాదన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మోజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో కాపు సంక్షేమ సంఘం నాయకులు పటేల్, కురుకుంద హరి, మద్దిలేటి, సత్యం, కురుకుంద శేఖర్, సోమ నాగి రెడ్డి, చంద్ర, లోకేష్, గాజుల రమణ, సందు నారాయణ, కురుకుంద వెంకట రాముడు, సతీష్, తూర్పు నాటి గోపాల్, ఎలక్ట్రీషియన్ మోహన్, తిరుపతయ్య, అక్షర స్కూల్ కరస్పాండెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒకే కాన్పులో ముగ్గురు శిశువుల జననం



ముగ్గురు శిశువులతో తల్లి, వైద్య బృందం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్రసూతి విభాగంలో ఓ మహిళకు ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు జన్మించారు. కల్లూరు మండలం సల్కాపురం గ్రామానికి చెందిన ఆర్.పవన్‌కుమార్ భార్య సుష్మారాణి(23) వృత్తిరీత్యా ప్రైవేటు ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తోంది. ఆమె గర్భవతి అయినప్పటి నుంచి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కాన్పుల వార్డు మూడవ యూనిట్‌లో పరీక్షలు చేయించుకుంటూ వైద్యం తీసుకుంటోంది. బీపీ ఎక్కువ కావడంతో 8వ నెలలోనే ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంది. రెండు వారాల వైద్యపరీక్షలు చేసిన అనంతరం వైద్యులు ఈ నెల 19న ఆమెకు సిజేరియన్ ద్వారా కాన్పు చేశారు. ఈ కాన్పులో ఒకేసారి ఆమెకు ముగ్గురు శిశువులు జన్మించారు. అందులో ఒకరు ఆడబిడ్డ 1.9 కిలోలు, ఇద్దరు మగపిల్లలు. వారి బరువు ఒకరు 1.5 కిలోలు, మరొకరు 1.9కిలోలు. తల్లికి హైబీపీ ఉండటం, బరువు తక్కువ పిల్లలు జన్మించడంతో వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చికిత్స చేశారు. తల్లీబిడలు కోలుకోవడంతో మంగళవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

నంద్యాల(సిటీ): నంద్యాల జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది మొత్తం రాష్ట్ర ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించాలని డివిజనల్ అభివృద్ధి అధికారి కళ్యాణి మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. 2024 సాధారణ ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలకు లోబడి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధులు నిర్వర్తించాలన్నారు. ఏ రాజకీయ పార్టీలకు సంబంధించిన సామాజిక మాధ్యమాలైన వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ సమూహాల నుంచి నిష్క్రమించాలన్నారు. ఏవేని రాజకీయ పార్టీలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రచారం చేస్తున్న అధికార, అనధికార గ్రూపుల నుంచి వైదొలగాలన్నారు. ఈ మేరకు మండలాభివృద్ధి అధికారులకు, మున్సిపల్ కమిషనర్లకు ఇదివరకే పలు సూచనలు జారీ చేశామన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు ఉంటాయన్నారు.

గోనెగండ్లలో టీడీపీకి కోలుకోలేని దెబ్బ

- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి గోనెగండ్ల మాజీ ఎంపీపీ

గోనెగండ్ల: మండలంలో టీడీపీకి కోలుకోలేని దెబ్బ తగలనుంది. ఆ పార్టీకి చెందిన మాజీ ఎంపీపీ వేముగోడు కృష్ణారెడ్డితో పాటు మరి కొంత మంది మాజీ ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరనున్నారు. ఇందుకు సంబంధించి కృష్ణారెడ్డి తమ అనుచరులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులతో మంగళవారం వేముగోడులో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు తీసుకున్నారు. అలాగే ఇప్పటికే వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలతోనూ కృష్ణారెడ్డి సమావేశమయ్యారు. ఈనెల 29న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు పర్యటనకు రానున్నారు. ఆ సందర్భంగా పార్టీలో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. కృష్ణారెడ్డి చేరికతో మండలంలో కొన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి ఊపు రానుంది. కృష్ణారెడ్డిని వైఎస్సార్‌సీపీలోకి వెళ్లకుండా కొందరు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నప్పటికీ తనకు బీవీ జయనాగేశ్వర రెడ్డికి పొంతన కుదరదని, తాను టీడీపీలో ఉండే ప్రసక్తే లేదని తెల్చి చెప్పినట్లు తెలిసింది.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన కర్ణాటక మద్యం

ఆలూరు రూరల్: అక్రమంగా నిల్వ ఉంచిన రూ.5.44 లక్షల విలువైన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు సెబ్ సీఐ సోమశేఖర్ తెలిపారు. మంళవారం సాయంత్రం ఆయన స్థానిక సెబ్ పోలీసు స్టేషన్‌లో జిల్లా సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో వివరాలు వెల్లడించారు. సోమవారం రాత్రి చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామంలో సోదాలు చేపట్టామన్నారు. బెల్లి మల్లికార్జున ఇంట్లో నిల్వ ఉంచిన 90 బాక్సుల కర్ణాటక మద్యం (8,640 ఒరిజన్ ఛాయిస్ 90 ఎంఎల్) స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం విలువ రూ. 5.44 లక్షలు ఉంటుందన్నారు. మల్లికార్జునను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారన్నారు. అక్రమ మద్యం నిల్వ కేసులో మరో ఇద్దరు వ్యక్తుల ప్రమేయం ఉండడంతో వారిని అరెస్ట్ చేయడానికి ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఉపాధ్యాయులు విధుల్లో చేరాలి

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పరీక్షలు 30వ తేదీతో ముగుస్తున్నాయని, పరీక్ష విధుల్లో ఉన్న కొంత మంది ఉపాధ్యాయులను ఇప్పటికే రిలీవ్ చేశామని, వెంటనే పాఠశాలల్లో విధుల్లో చేరాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27వ తేదీన సాంఘిక శాస్త్రం, 28న సాంస్కృతం పరీక్ష, 30న ఒకేషనల్ పరీక్షతో పరీక్షలు ముగుస్తాయన్నారు. పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు అవసరమైన సిబ్బందిని మాత్రమే విధుల్లో ఉంచుకొని మిగిలిన వారిని వెంటనే రిలీవ్ చేసినట్లు తెలిపారు.

నీరు పారె.. కాపు కాసె!

- సీఎం చొరవతో పంటలకు హంద్రీనీరు విడుదల



హంద్రీనీవా కాలువలో పారుతున్న నీరు

దేవనకొండ: హంద్రీ నీరు పారడంతో రబీ పంటలు రైతన్నల చేతికందుతున్నాయి. మండలంలో హంద్రీనీవా కాలువ కింద వేరుశనగ, మిరప, కొర్ర, సజ్జ, చౌలకాయ తదితర పంటలను దాదాపు 25 వేల ఎకరాల్లో రైతులు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పంటలు చివరి దశకు చేరుకున్నాయి. పంటను కోత కోసే పనిలో రైతన్నలు నిమగ్నమయ్యారు. సీఎం జగనన్న చొరవతోనే హంద్రీనీవా ద్వారా పంటలకు నీరు అందాయని రైతులు సంబర పడుతున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రైతుల అభ్యున్నతే కోరమాండల్ లక్ష్యం

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల అభ్యున్నతే లక్ష్యంగా కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ పని చేస్తుందని సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ పి.భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ రైతు సంబరాల ముగింపు కార్యక్రమంలో రైతులకు లక్కీ డ్రా ద్వారా టీవీఎస్ మోపెడ్ బైక్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పి.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కోరమాండల్ కంపెనీ రైతులకు నాణ్యమైన ఉత్పత్తులను పంపిణీ చేస్తోందన్నారు. స్లాబ్ ఆధారిత పథకం, కంపెనీ ప్రసిద్ధి చెందిన గ్రేడ్‌లు గ్రోమర్ 20-20-00-23, ఫారంపాస్‌లను కొనుగోలు చేసిన తర్వాత రైతులకు లక్కీ డ్రా ద్వారా బహుమతులు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆరుగురు రైతులకు టీవీఎస్ బైక్‌లను అందజేశామన్నారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ గోవిందరావు, డివిజనల్ అగ్రానమిస్ట్ టి.సుధాకర్‌రెడ్డి, సీనియర్ అగ్రానమిస్ట్ టి.శ్రీధర్‌రెడ్డి, ఎస్ఎస్‌పీ మేనేజర్ మాధవన్, మార్కెటింగ్ అధికారులు పి.శ్రీధర్‌రెడ్డి, రవి, రఘు, జూనియర్ అగ్రానమిస్ట్ శ్రావణ్, శివ పాల్గొన్నారు.



రైతులకు టీవీఎస్ బైక్‌లు పంపిణీ చేస్తున్న సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ పి.భాస్కర్‌రెడ్డి

నవ్వులే నవ్వులు

- ఘనంగా ముగిసిన కామన్న (మన్మధ) వేడుకలు
- ఆకట్టుకున్న హాస్య సన్నివేశాలు



కామన్న(మన్మధ) శవాన్ని కాటికి తీసుకెళ్తున్న హాస్య సన్నివేశం



రతి, మన్మధుని పెళ్లి ఊరేగింపు దృశ్యం

హొళగుంద: మండల కేంద్రం హొళగుందలో మంగళవారం కామన్న (మన్మధ) వేడుకల ముగింపులో హాస్య సన్నివేశాలు ప్రజలను కడుపుబ్బా నవ్వించాయి. యువకుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. హోలీ పున్నమిని పురస్కరించుకుని స్థానిక ఉరువకొండ మఠం (విరక్త మఠం) పరిసర ప్రాంతానికి చెందిన యువకులు, పెద్దలు కలిసి ఏడు రోజుల క్రితం ప్రారంభించిన వేడుకల్లో ప్రతి రోజు పలు హాస్య కార్యక్రమాలు నిర్వహించారు.

రతి, మన్మధల కథ ఆధారంగా...

ఈ పండుగ రతి, మన్మధల కథకు ముడిపడి ఉంది. దేవతలను రాక్షసులు పీడిస్తుండగా వారు మన్మధుడి దృష్టికి తీసుకొస్తారు. అప్పుడే రతిని పెళ్లి చేసుకున్న మన్మధుడు రాక్షసుల సంహరణ కోసం ఈశ్వరుడి వద్దకు వెళ్తాడు. ఈశ్వరుడు తపస్సులో ఉండటంతో పలు రకాల వేషాలతో భంగం కలిగిస్తాడు. కోపోద్రుక్తుడైన ఈశ్వరుడు మూడో కంటిని తెరిచి మన్మధుడిని బూడిద చేస్తాడు. విషయం తెలిసి రతి, దేవతలు ఈశ్వరుడిని వేడుకోగా మరో రూపంతో మన్మధుడికి పునర్జన్మ ఇస్తాడు. దీంతో వారు మరో సారి పెళ్లి చేసుకుని సంబరాలు చేసుకుంటారు. ఈ కథ ఆధారంగా సోమవారం రాత్రి కామన్న(మన్మధ) దహనం మంగళవారం ఉదయం శవ యాత్ర, కామన్నకు పునర్జన్మ, మన్మధుడు, రతి పెళ్లి ఊరేగింపు నిర్వహించారు.

ఘనంగా హోలీ వేడుకలు

రతి, మన్మధుల వివాహం సందర్భంగా హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు జల్లుకున్నారు.

క్లుప్తంగా

వైద్య శిబిరంలో 403 మందికి పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గోస్పాడు: మండలంలోని జూలేపల్లె గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు కాంతరావునాయక్, క్రాంతిచైతన్య, జ్యోతివాణి, మురళీమోహన్ 403 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగఅనసూయ, ఎంఈఓ అబ్దుల్‌కరీం తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని చిన్నచెరువు కట్టవద్దనున్న మూలమటంలో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. కోటపాడు గ్రూపు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేణునాథరెడ్డి ఆధ్వర్యంలో లెక్కింపు జరిగింది. ఏడాదికి గాను రూ.42,634 ఆదాయం వచ్చినట్లు రామాంజనేయశర్మ తెలిపారు. బాలాజీ మహిళా మండలి సభ్యులు, దేవస్థానం మాజీ చైర్మెన్ సన్నాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నందమూరినగర్, వైఎస్సార్‌నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌నగర్, నందమూరినగర్ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు చోరీల నేపథ్యంలో పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని కోరారు. ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు,సురేష్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసాని నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది



మాట్లాడుతున్న యూనిస్

నంద్యాల(అర్బన్): గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనిస్ అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ముస్లింలు సిద్దాంహుసేన్‌ను గౌరవిస్తారని, అలాంటి వ్యక్తిని నియంత అంటూ కించపరిచే విధంగా మాట్లాడం సరికాదన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆయనతో సమితి నంద్యాల జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాబ్‌బాషా, ఇక్బాల్ ఉన్నారు.

వాహనాల తనిఖీ



చాగలమర్రి టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చాగలమర్రి: ఎన్నికల నేపథ్యంలో చాగలమర్రి టోల్ ప్లాజా వద్ద పోలీసు చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. చాగలమర్రి ఎస్‌ఐ రమణయ్య, సిరివెళ్ల ఎస్‌ఐ సురేష్‌నాయుడు మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. నగదు, మద్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచామని వారు తెలిపారు. విలువైన వస్తువులు తీసుకెళ్లే వారు వాటికి సంబంధించిన బిల్లులు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు.

కోడ్ అతిక్రమిస్తే చర్యలు

ఉయ్యాలవాడ: ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాల్సిందేనని ఎంపీడీఓ రఘురాం అన్నారు. గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశామని తెలిపారు. పోస్టర్లు, స్టిక్కర్లు లేకుండా చేశామన్నారు. శిలా ఫలకాలపై పేపర్లను అంటించామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బందికి ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించామని తెలిపారు. గ్రామ వలంటీర్లు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. ఉద్యోగులు పాల్గొన్నా శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. రాజకీయ పార్టీల నాయకులు ప్రచారం నిర్వహించుకోవాలంటే తప్పనిసరిగా రిటర్నింగ్ అధికారి అనుమతి పొందాలని తెలిపారు.

నేత్రపర్వంగా ‘ప్రణయ కలహోత్సవం’

- శాస్త్రోక్తంగా తీర్థవారి చక్రస్నానం
- కనుల పండువగా పుష్పయాగం
- భారీగా తరలివచ్చిన భక్తులు



ఉభయదేవేరులతో పల్లకీపై విహరిస్తున్న ప్రహ్లాదవరదుడు



స్వామివారికి పూజలు చేస్తున్న పీఠాధిపతి



దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీప్రహ్లాదవరదుడి ఆలయంలో మంగళవారం కలహోత్సవం కనువిందుగా జరిగింది. ఉత్సవాల్లో చివరి రోజు గ్రామోత్సవాలు, ఆధ్యాత్మిక ఘట్టాలు భక్తులను అమితంగా అలరించాయి. ప్రహ్లాద వరదస్వామి దేవేరులతో పాల్గొన్న కలహ శృంగార భరితమైన ‘ప్రణయ కలహోత్సవం’ దిగువ అహోబిలంలో వైభవంగా జరిగింది. మధ్యాహ్నం స్వామివారు పల్లకీపై మాఢ వీధిలోని ఆలయ పుష్కరిని వద్దకు రాగా.. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు చెరో పల్లకీపై అప్రదణంగా వచ్చి స్వామివారికి ఎదురుపడ్డారు. ఎవరికీ చెప్పకుండా రహస్యంగా ఎక్కడికో వెళ్లి వచ్చిన ప్రహ్లాదవరదుడిని చూసిన దేవేరులు ఆగ్రహంతో అలిగి లోపలకు రావద్దంటూ తులుపులు ద్వారాలు మూయడం .. స్వామి భయపడి దాక్కోవడం.. మళ్లీ తలుపుల వద్దకు వచ్చి నక్కిచూడడం. అమ్మవారు ఆగ్రహించుకోవడంతో వెనక్కి వెళ్లడం ఇలా ఏడుసార్లు అదిరి బెదిరిన స్వామి తానేమి తప్పుచేయలేదంటూ ఇరువురు భామలను (అమ్మవార్లను) ప్రాథేయపడ్డారు. దేవేరులు శాంతించి ఇరువైపుల చేరి కర్పూర హారతులు ఇవ్వడంతో కలహం వీడి ప్రణయం పండించారు. అనంతరం ప్రహ్లాదవరదుడు ఓ వైపు.. మరో వైపు ఎదురుగా దేవదేవేరులు ఒకరిపై ఒకరు పూల బంతులు విసరడం, స్వామి పుష్పఘాతం నుంచి తప్పించుకోవడం వంటి ఆసక్తికరమైన సన్నివేశాలతో ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రణయకలహోత్సవం భక్తులను కనువిందు చేసింది.

చక్రధారి.. కోనేటి వైభవం!

బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా తీర్థవారి చక్రస్నానం నిర్వహించారు. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాముల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కోనేటి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ శాస్త్రోక్తంగా తిరుమంజనం నిర్వహించారు. అనంతరం సుదర్శనమూర్తికి, నిత్య అభిషేక ఉత్సవ మూర్తికి కోనేరులో తీర్థవారి చక్రస్నానం చేయించారు. ఉత్సవమూర్తులతో పాటు, అర్చకులు, వేద పండితులు, ఆలయ అధికారులు, సిబ్బంది, వేలాది మంది భక్తులు చక్రస్నానం చేశారు.

వైభవంగా ద్వాదశ ఆరాధన

మధ్యాహ్నం ద్వాదశ ఆరాధనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామికి ఆరాధన దోషాలను నివృత్తి చేసుకోవడం కోసం 12 మార్లు తిరువారాధన చేసి 12 రకాల భక్షాలను (మిఠాయిలు) 12 రకాల అన్నం (వంటకాలు)తో ఉత్సవ మూర్తులకు నివేదించారు.

పూలు పరిమళించే.. భక్తులను తరింపజేసే

జయజయ నారసింహా నామ సంకీర్తనలు ప్రతిధ్వనిస్తుండగా.. దేదీప్యమానమైన విద్యుద్దీపకాంతుల వెలుగులో.. వేద పండితుల వేదోక్త మంత్ర పఠనములు.. ఆస్థాన విద్వాంసుల మంగళకరమైన వాయిద్యాల నడుమ శ్రీప్రహ్లాదవరదుడు దేవేరీ మహాలక్ష్మీల పుష్పయాగం వేడుక మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. స్వామిఅమ్మవార్లను యాగశాలలో కొలువుంచి అభిషేకం, అర్చనలు నవకలస స్నపన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం విశేషాలంకరణ చేసి దేశంలోని వివిధ ప్రదేశాల నుంచి తెప్పించిన 108 రకాల పూలు, పత్రాలతో అలకంరించిన యాగశాలలో కొలువుంచారు. పూలతో స్వామి, అమ్మవార్ల పాదాల నుంచి హృదయం మునిగేంత వరకు పుష్పారాదన నిర్వహించారు. తరువాత దూపదీప నీరాజనాలు సమర్పించి పుష్పాలను పూర్తిగా తొలగించడం ఇలా ఇరవైసార్లు సుమధుర సుగంధాలు విరజిమ్మే పుష్పజాతులతో ఈ పుష్ప కైంకర్యం సుమారు 5 గంటల పాటు కనుల పండువగా నిర్వహించారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శిల్పారవి



నంద్యాల(అర్బన్): మండలంలోని చాబోలు గ్రామం మర్కద్ మసీదులో మంగళవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పాల్గొన్నారు. ముస్లిం యువకులు, మతపెద్దలతో కలిసి విందు ఆరగించారు. అనంతరం అల్లా అందరికీ మంచి చేయాలంటూ ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు ఎమ్మెల్యేను సన్మానించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మదార్‌సా, బాలహుసేన్, ముస్లింలు అయూబ్, ఫారుక్, ఇలియాజ్, కరీముల్లా, రషీద్, మాబాషా, జఫీజ్, హుసేన్‌బాషా పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

పగిడ్యాల: జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నెహ్రూనగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వనుముల నాగేషులు (48) దనసరి కూలీ. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూతురి పెళ్లి సమయంలో బయటి వ్యక్తుల వద్ద రూ. 2లక్షలు అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేనని మనస్థాపం చెంది గ్రామ శివారులోని పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన నంద్యాల 24వ వార్డు టీడీపీ నాయకులు



భూమా కిశోర్‌రెడ్డి సమక్షంలో చేరిన పెద్దభోదనం వాసులు

- టీడీపీ జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు అబ్దుల్‌నబీ సహా పలువురి చేరిక
- సాదరంగా ఆహ్వానించిన మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి
- చాగలమర్రి, ఉయ్యాలవాడలో భూమా కిశోర్‌రెడ్డి సమక్షంలో చేరిన టీడీపీ నేతలు



నంద్యాల 12వ వార్డు టీడీపీ నాయకులు



ఉయ్యాలవాడలో..

నంద్యాల(న్యూటౌన్)/బొమ్మలసత్రం: టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అబ్దుల్‌నబీ, ఫరూక్, సీఎం బాషా, అన్వర్, 12వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్తలు మంగళవారం మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా శిల్పామోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పాలన, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎంపీగా పోచాబ్రహ్మానందరెడ్డిల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. 24వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి షేక్‌రహంతుల్లా, సీనియర్ అడ్వకేట్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మునెయ్య, ప్రసాద్, కో ఆప్షన్ సభ్యుడు సలాముల్లా, 12వ వార్డు ఇన్‌చార్జి గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. చేరిన వారిలో ఖాజా హుసేన్, షబ్బీర్, సురేష్, మాబాషా, అమీర్, బాలాజీ, అబ్దుల్, ఇమ్రాన్, కరీం, జమీల్ బాషా, రియాజ్, శ్రీనివాసులు, నాగరాజు, నాగేంద్ర తదితరులు ఉన్నారు.

టీడీపీ విధానాలు నచ్చక చేరికలు

చాగలమర్రి/ఉయ్యాలవాడ: ప్రతిపక్ష టీడీపీ అవలంభిస్తున్న విధానాలు నచ్చకే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో వీడుతున్నారని ఆళ్లగడ్డ వైఎస్సార్‌సీపీ నేతలు భూమా కిశోర్‌రెడ్డి, రాంనాథ్‌రెడ్డి అన్నారు. చాగలమర్రి మండలం పెద్దభోదనం ఎస్సీ కాలనీకి చెందిన 60 కుటుంబాలు, ఉయ్యాలవాడ మండలం పెద్దయమ్మనూరు గ్రామానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరిని భూమా కిశోర్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పెద్దభోదనంకు చెందిన టి.అశోక్, ఓబులం నరసింహుడు, ఎర్రన్న, పి.ఓబులేసు, గిత్త పాములేటి, ముండి మద్దిలేటి, గజ్జెల బాలయ్య, గోసి నాగయ్య, పెద్దయమ్మనూరు గ్రామానికి చెందిన కాశింరెడ్డి లక్ష్మీరెడ్డి, కాశింరెడ్డి రామస్వామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గంట వెంకటక్రిష్ణ, అనకల వీరారెడ్డి, చెన్నారెడ్డి గారి మధుసూదన్‌రెడ్డి, గోపాలక్రిష్ణ, సింగారెడ్డి లక్ష్మీకాంతరెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో టీడీపీ హామీలను విస్మరించిందని.. వైఎస్సార్‌సీపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిందని అన్నారు. టీడీపీపై నమ్మకం లేదన్నారు. సీఎం జగన్ పాలనలో పేదల జీవితాలతో పాటు గ్రామాలు బాగుపడ్డాయని తెలిపారు. ఈ నెల 28న నంద్యాలలో జరిగే సీఎం సభను విజయవంతం చేయాలని భూమా కిశోర్‌రెడ్డి కోరారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు భూమా వీరభద్రారెడ్డి, అంబటి మహేశ్వరరెడ్డి, దండేలా భాస్కర్‌రెడ్డి, ఆవుల రాఘవేంద్రారెడ్డి, శంకర్‌రెడ్డి, గౌస్, భూపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సుబ్బారాయుడు, వలి పాల్గొన్నారు.

కౌరవ సైన్యాన్ని ఎదుర్కొనేందుకు విద్యార్థి లోకం సిద్ధం



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(న్యూటౌన్): సార్వత్రిక ఎన్నికల్లో కౌరవ సైన్యాన్ని ఎదుర్కొనేందుకు విద్యార్థి లోకమంతా సిద్ధంగా ఉందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జోనల్ ఇన్‌చార్జి సాయిరాంరెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక స్వగృహంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు ఆధ్వర్యంలో మేమంతా సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తయారు చేశారని, ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి విద్యార్థులకు బడులు తెరిచే రోజే పుస్తకాలు, యూనిఫాం, షూ, టై, బెల్టులు అందజేశారని తెలిపారు. జగనన్న గోరుముద్ద, వసతి దీవెన, విద్యాదీవెన, విదేశీ విద్య పథకాల ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఈనెల 28వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో నిర్వహించే బస్సు యాత్రను విద్యార్థులంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ చైర్మన్ రామినేని రాజునాయుడు, ప్రధాన కార్యదర్శి దిలీప్‌రాజు, గిరిజన విద్యార్థి సమాఖ్య రవీంద్రనాయక్, సంపత్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



యర్రగుంట్లలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: ఈనెల 28వ తేదీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో యర్రగుంట్లలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆళ్లగడ్డ నుంచి నంద్యాలకు బస్ యాత్రకు వెళ్లే మార్గ మధ్యలో యర్రగుంట్ల జాతీయ రహదారి పక్కన శ్రీనాథ్ నర్సింగ్ హోం పక్కనున్న ఖాళీ స్థలంలో ప్రదేశాన్ని సిద్ధం చేస్తున్నారు. రైతులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులతో సీఎం వైఎస్ జగన్ ముఖాముఖి నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, సీనియర్ నాయకుడు గంగుల విజయసింహారెడ్డి స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు సర్పంచ్ అయ్యలూరి సుభహాన్, ఉప సర్పంచ్ సత్తార్ ప్రతాపరెడ్డి, నాయకులు గాజ కృష్ణారెడ్డి, సత్తార్ పూల రామిరెడ్డి, సొసైటీ చైర్మన్ మేరుగు చిన్ననాగిరెడ్డి, పెద్దలాల్, పురుషోత్తం, చీమల రమేష్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన న్యాయవాది జీవీఎస్ ప్రసాద్ తదితరులతో శిల్పామోహన్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది జీవీఎస్ ప్రసాద్, ఆయన తనయుడు శ్రీచైతన్య, కుటుంబ సభ్యులు టీడీపీని వదిలి మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి వారి ఆర్థికాభ్యున్నతికి కృషి చేసిందన్నారు. జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం కింద ఆర్థిక సహాయం చేసిందని తెలిపారు. న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని అన్నారు. ముఖ్యమంత్రి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల కు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి నంద్యాలను అభివృద్ధి చేస్తున్న తీరు, శిల్పా కుటుంబం చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రజలకు చేరువ అవుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ కార్యదర్శి పెద్దిశీను, రామసుబ్బయ్య, నాయకులు శశికళారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, రవికృష్ణ, దేశం సుధాకర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, దండె శీను, ముక్కెర కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం బస్సుయాత్రను విజయవంతం చేద్దాం

నంద్యాల(సెంట్రల్): నంద్యాలలో ఈనెల 28న నిర్వహించనున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల భరత్ కుమార్‌రెడ్డి కోరారు. ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఎన్నికలు దగ్గర పడడంతో విపక్షాలన్నీ ఏకమై దుర్మార్గపు రాజకీయాలు చేస్తున్నాయని.. ఎవరెన్ని చేసినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



చాకరాజువేములలో మాట్లాడుతున్న ఎస్‌ఐ

దొర్నిపాడు: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్‌ఐ సురేష్ కోరారు. మంగళవారం దొర్నిపాడు, చాకరాజువేముల గ్రామాల్లో హోటళ్లు, టిదుకాణదారులకు ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ముందుస్తు చర్యగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అందరూ స్వేచ్ఛగా ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హోటళ్ల వద్ద జనాలు గుంపులుగా చేరకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

జూపాడుబంగ్లా: అనారోగ్యంతో తాటిపాడు గ్రామానికి చెందిన సగినాల శేషమ్మ (76) పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. తాటిపాడు గ్రామానికి చెందిన సగినాల శేషమ్మ అల్సరు, హైబీపీ, షుగరు, చర్మసంబంధ వ్యాధులతో బాధపడుతూ వైద్యుల వద్ద చికిత్సలు చేయించుకుంటూ ఉండేది. ఎన్ని మందులు వాడినా వ్యాధులు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 21న ఇంట్లో ఉంచిన పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతిచెందింది. మృతురాలి కొడుకుల పిర్యాదు మేరకు కేసున మోదు చేసుకొని మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

పదో తరగతి పరీక్షకు 2104 మంది గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి బయాలజికల్ సైన్స్ పబ్లిక్ పరీక్షకు మంగళవారం 2104 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలను సజావుగా నిర్వహించామన్నారు. నంద్యాల జిల్లాలో 134 పరీక్ష కేంద్రాల్లో 27,820 మంది విద్యార్థులకు గాను 25,716 మంది (92.44) హాజరైనట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రాలను 8 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 31 పరీక్ష కేంద్రాలను సందర్శించగా.. స్టేట్ అబ్జర్వర్ గంగాభవానీ రెండు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి పరీక్షలు సజావుగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.

వధువుకు ఆర్థిక సాయం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల హరిజనవాడకు చెందిన నిరుపేద వధువు వివాహ ఖర్చుల నిమిత్తం మంగళవారం వాసవీ దశ్ వాసవీక్లబ్, బాలాజీ వైశ్య మిత్రమండలి ఆధ్వర్యంలో ఆర్థికసాయం చేశారు. వివాహ ఖర్చుల నిమిత్తం నగదు, వెండి మెట్టెలు, నిత్యావసర సరుకులను అందజేసినట్లు సంఘం నేత బింగుమల్ల శ్యాంసుందర్‌గుప్త తెలిపారు. కౌన్సిలర్ కండేశ్యాంసుందర్‌లాల్, సుబ్బలక్ష్మయ్య, నాగరాజు, మురళీ, జనార్దన్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అష్టాదళ పాదపద్మారాధన సేవ





కాళికాంబ, సంజీవనగర్‌లో వేంకటేశ్వరస్వామి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లోని శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతం, నిమ్మ, వేప రసాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం, 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ చేశారు. మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంజీవనగర్ రామాలయంలో..

సంజీవనగర్ రామాలయంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామికి అష్టాదళ పాదపద్మారాధనసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి 108 బంగారు పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు.

తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

నంద్యాల(వ్యవసాయం): తాగి వాహనం నడిపిన వ్యక్తికి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి 14 రోజుల జైలు శిక్ష విధించినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. గడివేముల మండలం ఆర్లగడ్డకు చెందిన రెడ్డిపోగు విజయ్ కుమార్ మద్యం తాగి వాహనం నడుపుతుండగా బ్రీత్‌అనలైజర్ పరీక్ష చేసినట్లు చెప్పారు. రుజువు కావడంతో కేసు నమోదు చేసి జడ్జి ఎదుట హాజరుపరచగా శిక్ష ఖరారు చేసినట్లు తెలిపారు.

అన్నిమార్గాల్లో చెక్‌పోస్టులు



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పాణ్యం : నంద్యాల జిల్లాలోకి ప్రవేశించే అన్ని మార్గాల్లో చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తమ్మరాజుపల్లె వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోకి నగదు, మద్యం, గంజాయి తదితర అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దులో చెక్‌పోస్టు చేసినట్లు చెప్పారు. చెక్ పోస్టులో షిప్టుల వారీగా విధులు నిర్వహించి 24 గంటలు వాహనాలు తనిఖీ చేస్తున్నామన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అనుమానం వచ్చిన వాహనంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.